ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు

5

గురువారం 18 సెప్టెంబరు 2025

ఉపాధ్యాయుల విజయవాడ బాట



- రేపు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత
- కర్నూలు నుంచి 134 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాల అభ్యర్థులకు 1నుంచి 124 నెంబరు గలవి
- నాల్ లోకల్ వారికి 125 నుంచి 133 నెంబరు వరకు..

సీఎం చంద్రబాబునాయుడు చెప్పిన విధంగానే మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేసి నిరుద్యోగుల కలలను సాకారం చేశారు. 2025 ఏప్రిల్‌లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. జూన్ 6 నుంచి జూలై 2వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. సెప్టెంబరు 15న తుది జాబితా విడుదల చేశారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా రేపు విజయవాడలో మధ్యాహ్నం 2గం టలకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేయ నున్నారు. విజయవాడకు వెళ్లేందుకు ప్రభుత్వమే 134 ఆర్టీసీ బస్సులను ఉమ్మడి జిల్లాలకు కేటాయించారు. ఈ బస్సుల ద్వారా అభ్యర్థులు విజయవాడకు చేరుకుంటారు.



నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్ర భుత్వం ఏడాదిలోనే డీఎస్సీని నిర్వహించి తక్కువ కాలంలోనే ఫలితాలు ప్రకటించారు. మెగా డీఎస్సీ ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19న విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రా లను అందజేయనున్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,678 ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయి. ఇందులో అన్ని కేటగిరీల్లో కలుపుకుని 2590 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. మరో 88 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో 88 ఉపాధ్యాయ పోస్టులు మిగిలిపోయాయి. వచ్చే ఏడాది నిర్వహించే డీఎస్సీలో మిగిలిపోయిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ జిల్లా పరిషత్ యాజమాన్యం విభాగంలో అన్ని కేటిగిరిలో 2,547 పోస్టులకు గానూ 2483 పోస్టులు భర్తీ కాగా, 64 పోస్టులు మిగిలిపోయాయి. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యం విభాగంలో 58 పోస్టులకు గానూ 51 భర్తీ కాగా ఏడు పోస్టులు మిగిలాయి. మున్సిపల్ యాజమాన్యం విభాగంలో 40 పోస్టులకు గానూ 28 పోస్టులు భర్తీ కాగా, 12 పోస్టులు, ట్రైబల్ యాజమాన్యం విభాగంలో 33 పోస్టులకు గానూ 28 భర్తీ కాగా, ఐదు పోస్టులు అర్హత గల అభ్యర్థులు లేకపోవడంతో మిగిలిపోయాయి.

మిగతా 6వ పేజీలో

340 పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు



మాట్లాడుతున్న డీపీవో లలితాబాయి

చాగలమర్రి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 340 పంచాయతీల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి తెలిపారు. బుధ వారం చాగలమర్రి గ్రామం లోని మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చే శారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ చాగలమర్రి గ్రామ పంచాయతీల్లో 14 మంది వాటర్‌మెన్‌లు ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. అంతమంది ఎందుకు అధికంగా ఉన్నారని, వారిని ఎలా చేర్చుకున్నారో వివరణ ఇవ్వాలని ఈవో తారకేశ్వరికి ఆదేశించారు. 489 గ్రామ పంచాయతీల్లో రూ.10కోట్లు పన్ను వసూలు లక్ష్యం ఉందన్నారు. ఇంతవరకు రూ.5 లక్షలు పన్ను వసూలు చేశారని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో ముందుగా గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు చెల్లించడం జరుగుతోందన్నారు. అక్టోబరు 2 వరకు స్వచ్ఛసేవ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

63,818 హెక్టార్లలో వరి సాగు : డీఏవో



రైతులకు సూచనలిస్తున్న డీఏవో మద్దిలేటి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 63,818 హెక్టార్లలో వరి సాగు చేశారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మద్దిలేటి తెలిపారు. బుధవారం ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో పర్యటించి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5,95,535 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటివరకు 5,33,460 ఎకరాలు సాగైందన్నారు. అధికంగా 63,818 హెక్టార్లలో రైతులు వరిని సాగు చేశారన్నారు. మొక్కజొన్న 61,924 హెక్టార్లలో, కంది 36,043 హెక్టార్లలో సాగు చేశారన్నారు. వరి పంటలో సస్య రక్షణ చేపట్టాలని రైతులకు సూచించారు.

6ఏ కేసులు నమోదు

జిల్లా వ్యాప్తంగా 109 ఫర్టిలైజర్ షాపులను తనిఖీచేయగా వాటిలో సరిగా లేని 10 షాపులపై 6ఏ కేసులు నమోదు చేసి 83.5 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్ చేశామని డీఏవో తెలిపారు. యూరియాను బ్లాక్‌మార్కెట్‌లో అమ్మినా, ప్రభుత్వ ధరల కన్నా ఎక్కువ ధరకు అమ్మినా అలాంటి దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 47,267మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సుధాకర్, ఏవో శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

శ్రీగిరిపై 22 నుంచి

దసరా మహోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు

6

వన్యప్రాణులను సంరక్షించుకుందాం

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- ఆధునిక వైద్యం పేదలకు అందించడమే లక్ష్యం
- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



వేదికపై ఎంపీ బైరెడ్డి శబరి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకదృష్టి సారించాయని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం జీజీహెచ్‌లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆమెతో పాటు నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఎల్ఈడీ టీవీని ఏర్పాటుచేసి ప్రధాని మోదీ జన్మదిన సందర్భంగా మధ్య ప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని లైవ్ ద్వారా తిలకించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఆధునిక వైద్యం పేదలకు అందించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. గర్భిణులకు ఈ నెల 17నుంచి 22వరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 17మెడికల్ కళాశాలలు మంజూరు చేసి రూ.8.500కోట్లు మంజూరుచేయగా వైసీపీ హయాంలో రూ.1400కోట్లు ఖర్చుచేశారన్నారు. మిగిలిన డబ్బు ఎక్కడకు పోయిందని తెలపాలని ఆమె ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ విద్యాసాగర్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీసీహెచ్ఎస్ లలిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి, మలేరియా అధికారి చంద్రశేఖర్, డా.అంకిరెడ్డి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ జగదీశ్చంద్రారెడ్డి, డీఐవో సుదర్శన్‌బాబు, డెమో రవీంద్రనాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సురేఖ, ఐసీడీఎస్ పీడీ తదితరులు పాల్గొన్నారు.

టమోటా ధర పతనం

- కిలో రూ.5కు పడిపోయిన వైనం
- ఆందోళనలో రైతాంగం



టమోటాలు ఆటోలో విక్రయిస్తున్న రైతు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిన్న మొన్నటి వరకు ఆకాశాన్నంటిన టమోటా ధరలు అంతలో అధఃపాతాళానికి చేరుకున్నాయి. ఈఏడాది టమోటా దిగుబడి బాగుందనుకున్న అన్నదాతలకు, ధరలు అమాంతం పడిపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. ఎన్నో వ్యయప్రయాసలతో పండించిన పంటలకు మార్కెట్లో సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభంలో రైతులకు కాస్త గిట్టుబాటు ధర పలకడంతో ఊపిరి పీల్చుకున్నారు. జూలై, ఆగస్టు మాసాల్లో 15కిలోల బాక్స్‌ధర రూ.400 నుంచి రూ.450 దాకా పలికింది. కిలో రూ.40నుంచి రూ.50వరకు అమ్ముడయ్యాయి. అన్నదాతలకు ఆనందం కలిగించింది. కొద్ది రోజుల నుంచి కిలో రూ.5కూడా అమ్ముడు కావడం లేదని వాపోతున్నారు. ఎకరాకు రూ.60వేలకు పైగా పెట్టుబడి పెట్టి పండించిన టమోటా రైతుల పాలిట శాపంగా మారింది. మార్కెట్‌కు తరలిస్తే రవాణా ఖర్చులు కూడా దక్కడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకుందాం

- అటవీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు
- దేశంలోనే ఎన్ఎస్‌టీఆర్ ఫారెస్ట్ అతిపెద్ద సర్కిల్
- అటవీ సంరక్షణాధికారి విజయకుమార్



మాట్లాడుతున్న సీఎఫ్ విజయ్‌కుమార్

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను సంరక్షించు కుందామని అటవీ సంరక్షణాధికారి విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కార్యాలయంలో అటవీ సంరక్షణాధికారి, టైగర్ సర్కిల్ ప్రాజెక్టు ఫీల్డ్‌డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు ఈసందర్భంగా విజయకుమార్‌కు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ నేరాలు, వన్యప్రాణాల వేట ఎలాంటి పరిస్థితుల్లో క్షమించమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో తాను ఆత్మకూరు డీఎఫ్‌వో పనిచేసిన అనుభవం ఉందన్నారు. దేశంలోనే నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్(ఎన్ఎస్‌టీఆర్)ఫారెస్ట్ అతి పెద్ద సర్కిల్ అన్నారు. పులుల కదలికలు ఉంటేనే నల్లమల అటవీ ప్రాంతం మరింత పెరిగే అవకాశం ఉంటుం దన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రాణవాయువును పెంచుకునే అవకాశం ఉందన్నారు. ఇతర టైగర్ సర్కిల్స్‌లో వాడుతున్న అడ్వాన్స్ టెక్నాలజీని ఎప్పటికప్పుడు తెలుసుకుని అటవీసంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు మరింత మెరుగైన పద్ధతులతో ముందుకెళతామన్నారు. జంతువులకు హాని కలగకుండా, ట్రైబల్స్ హక్కులకు భంగం కలిగించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నంద్యాల ఫారెస్ట్ డీడీ అనురాగ్‌మీనా, ఆత్మకూరు, మార్కాపురం డీడీ అబ్దుల్‌రావూఫ్, గిద్దలూరు డీడీ నిషాకుమారి, శ్రీశైలం సబ్ డీఎఫ్‌వో బబిత కుమారి, నంద్యాల, బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షేక్ నజీర్‌జా తదితరులు పాల్గొన్నారు.

పతనమైన పత్తి ధర

- క్వింటా గరిష్ఠంగా రూ.7,659



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పత్తి ధరలు భారీగా పతనమయ్యాయి. ఒక్క రోజులోనే క్వింటాకు రూ.300 పైగా ధర తగ్గడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగయిన పత్తి చేతికి రావడంతో మొదటి కోత పత్తిని విక్రయానికి తీసుకొచ్చారు. వాతావరణ పరిస్థితుల వల్ల రైతులు తేమతోనే పత్తిని విక్రయానికి తీసుకురావడంతో ధర తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఆరంభంలోనే ధర పతనం కావడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా బుధవారం మార్కెట్‌కు 3,809 క్వింటాళ్ల పత్తి విక్రయానికి తీసుకురాగా వాటి కనిష్ఠ ధర రూ. 4,029, గరిష్ఠంగా రూ.7,659, సగటున రూ.7,481 పలికింది.

శ్రీగిరిపై 22 నుంచి దసరా మహోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు



శ్రీశైలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శరన్నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఆలయ ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. అశ్వయుజ శుద్ధ పాడ్యమి సోమవారం ఉదయం 9 గంటలకు శాస్త్రోక్తంగా యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. శరన్నవరాత్రుల్లో శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 22న శైలపుత్రి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వగా స్వామివారు భృంగి వాహనంపై విహరిస్తున్నారు. అదేవిధంగా 23న బ్రహ్మచారిణి అలంకారం, మయూర వాహన సేవ, 24న చంద్రఘంట అలంకరణ, రావణవాహన సేవ, 25న కూష్మాండదుర్గ అలంకరణ, కైలాస వాహన సేవ 26న స్కందమాత అలంకారం, శేషవాహనసేవ, 27న కాత్యాయని అలంకరణ, హంసవాహనసేవ, 28న కాళరాత్రి అలంకరణ, గజవాహనసేవ ఉంటుంది. అదేవిధంగా 29వ తేదీ అమ్మవారు మహాగౌరిగా భక్తులకు దర్శనమిస్తారు. అదేరోజు స్వామివారికి నందివాహన సేవ ఉంటుంది. 30న సిద్ధిదాయిని అలంకారం, కైలాస వాహన సేవ, అక్టోబరు ఒకటో తేదీన రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారం, అశ్వవాహనసేవ, 2వ తేదీన దసరా వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. దసరా రోజున అమ్మవారం భ్రమరాంబికాదేవిగా భక్తులకు దర్శనమిస్తారు.. అదే రోజు ఆది దంపతులకు నందివాహన సేవ ఉంటుంది. తర్వాత ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం శమీ పూజ, రాత్రికి తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

సీజీఎంగా ఉమాపతికి పదోన్నతి



ఎం.ఉమాపతి

కల్లూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు విద్యుత్‌శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈగా పనిచేస్తున్న ఎం.ఉమాపతి పదోన్నతి పొందారు. ఈమేరకు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కే. సంతోషరావు బుధవారం ఎం.ఉమాపతికి కార్పొరేట్ ఆఫీస్ తిరుపతిలో చీఫ్ జనరల్‌మేనేజర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు ఉమాపతికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రదీప్‌కుమార్‌కు ఎస్ఈగా పదోన్నతి

కర్నూలు జిల్లా విద్యుత్ శాఖలో డీఈ డీపీటీగా పనిచేస్తున్న ఆర్.ప్రదీప్‌కుమార్ ఎస్ఈగా పదోన్నతి పొందారు. ఈమేరకు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కే.సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏ జిల్లాకు ఎస్ఈ అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఎస్ఈగా పదోన్నతి పొందిన ఆర్.ప్రదీప్‌కుమార్‌ను ఆశాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.

స్వామిత్వ వేగవంతం



కేపీ తాండలో స్వమిత్వ సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన పథకం స్వామిత్వ. గ్రామ కంఠం సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2020లో స్వామిత్వ సర్వేకు శ్రీకారం చుట్టింది. 2024 ఎన్నికలకు ముందు జిల్లాలో తొలివిడతలో 42 గ్రామాల్లో వివరాలు సేకరించింది. రెండో విడతలో 188 పంచాయతీల్లో సర్వే నిర్వహిస్తున్నారు. మొదటి విడతలో చేపట్టిన సర్వే చాలా వరకు తప్పుల తడకగా సాగింది. వీటి దిద్దుబాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం గ్రామాల్లో స్వామిత్వ సర్వే వేగంగా సాగుతోంది.

- గ్రామ కంఠం భూములకు హక్కులు
- రాజముద్రతో హక్కు పత్రం ఇచ్చేందుకు సిద్ధం
- ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లో హర్షం

చాగలమర్రి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వామిత్వ సర్వే వేగంగా సాగుతోంది. భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చొరవ చూపుతోంది. జిల్లాలో 50 శాతం నివాసాలకు యజమానుల వద్ద ఆస్తి పత్రాలు లేవు. దీంతో క్రయ, విక్రయాలకు అవకాశం లేకుండా పోయింది. గ్రామ ఖంఠం భూములకు కొనుగోలు చేసిన వాటిలో నిర్మాణాలు చేపడితే బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేయడం లేదు. దీంతో గ్రామ కంఠంలోఉన్న ఇళ్లకు ఆస్తి హక్కు లేకపోవడంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం గ్రామ కంఠంలో ఉన్న ఇళ్లకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు స్వామిత్వ సర్వే చేపట్టింది. జిల్లాలో ఇప్పటికే గ్రామాల్లో 80 శాతం సర్వే పూర్తయినట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 28 మండలాల్లో..

నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో 489 పంచాయతీలు, రెవెన్యూ పరిధిలో 422 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో 3.20 లక్షల ఇళ్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గ్రామాల్లో గ్రామ కంఠం సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2021లో స్వామిత్వ సర్వేకు శ్రీకారం చుట్టింది. 2024 ఎన్నికలకు ముందు జిల్లాలో తొలివిడతలో 42 గ్రామాల్లో వివరాలు సేకరించింది. రెండో విడతలో 188 పంచాయతీల్లో సర్వే నిర్వహిస్తున్నారు. గతంలో మొదటి విడతలో చేపట్టిన స్వామిత్వ సర్వే చాలా వరకు తప్పుల తడకగా సాగింది. వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలపై మాజీ సీఎం జగన్‌బొమ్మను ముద్రించారు. వీటి దిద్దుబాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రాజముద్రతో పత్రాలు ఇచ్చేందుకు సర్వే సాగుతోంది.



గొట్లూరు గ్రామంలో ఇంటి కొలతలు వేస్తున్న ఇంజనీరింగ్ సహాయకులు

వారసుల పేర్లపై బదలాయింపు జరగక..

గ్రామకంఠం భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారసుల పేర్లపై బదలాయింపు జరగడం లేదు. ఈ నేపథ్యంలో స్వామిత్వ ద్వారా ముందుగా రెవెన్యూ ఆయా గ్రామాల హద్దులు గుర్తిస్తున్నారు. అనంతరం చెరువులు, పాఠశాలలు, రహదారులు, దేవాలయాలు, అంగ్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలను నమోదు చేస్తున్నారు. ఆ తరువాత ప్రజలు కట్టుకున్న గృహాలకు డ్రోన్ ద్వారా ఫొటోలు తీసి హద్దులను నిర్ణయిస్తున్నారు. పంచాయతీ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి ఇంటి యజమాని పేరు, ఇంటి నంబర్, ఎప్పుడు నిర్మించుకున్నారు. తదితర వివరాలు సేకరిస్తున్నారు.

విక్రయానికి అవకాశం

సర్వే అనంతరం ఇంటి యజమానికి ఆస్తి హక్కు కార్డులు అందజేస్తారు. ప్రతి కార్డుకు పీపీఎన్ (ప్రాపర్టీ పార్శిల్ నంబర్) కేటాయిస్తారు. ప్రత్యేక క్యూఆర్‌కోడ్ ఉంటుంది. ఇందులో యజమాని పూర్తి వివరాలు ఉంటాయి. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇంటర్‌నెట్‌లో వివరాలు ఎప్పుడైనా చూసుకోవచ్చు. కుటుంబ అవసరాల కోసం విక్రయించుకోవచ్చు. బ్యాంకుల నుంచి రుణాలు పొందొచ్చు.

తప్పులు లేకుండా హక్కు పత్రాలు

స్వామిత్వ సర్వేలో గ్రామ కంఠంలో ఉన్న ఇళ్లకు యాజమాన్యపు హక్కులు కల్పించి హక్కు పత్రాలు తప్పులు లేకుండా జారీ చేస్తారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులు సర్వేను వేగవంతం చేస్తున్నారు. ఈ సర్వేను దీపావళికి పూర్తి చేసి హక్కు పత్రాలను రాజముద్రతో ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు.

స్వామిత్వ సర్వే వేగవంతం

జిల్లాలోని 28 మండలాల్లో గల 188 గ్రామ పంచాయతీల్లో రెండో విడత స్వామిత్వ సర్వే వేగవంతం చేస్తున్నాం. హక్కుల పత్రాల్లో ఎలాంటి తప్పుల్లేకుండా జారీచేస్తాం. ఈమేరకు పంచాయతీ సిబ్బందికి డిప్యూటీ ఎంపీడీవో ద్వారా ఆదేశాలిచ్చాం. 90 శాతం దాకా సర్వే జరుగుతోంది. అక్టోబరు చివరినాటికి సర్వే పూర్తిచేయాలన్న లక్ష్యం ఉంది.

- లలితాబాయి, డీపీవో, నంద్యాల



స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ఆరోగ్య భద్రతే లక్ష్యం

- 'స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్' షురూ
- అన్ని ఆసుపత్రుల్లో మహిళలకు వైద్య పరీక్షలు



ఆలూరు మండలం మొలగవల్లి పీహెచ్‌సీలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. బుధవారం నుంచి స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ శక్తిమంతమైన కుటుంబం) కార్యక్రమం ప్రారంభ మైంది. 15 రోజులపాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు వైద్య, ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక కారణాలతో ఆసుపత్రికి వెళ్లలేని స్థితిలో ఉండే వారికి అండగా నిలిచి వారికి వైద్యసాయం అందించమే ఈఅభియాన్ లక్ష్యం. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలు, పీహెచ్ సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఆలూరు మండలం మొలగవల్లి, ఆలూరు, కమ్మరచేడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అందించే సేవలు..

మహిళలు, కిశోర బాలికలకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, గర్భాశయ, రొమ్ము, నోటి క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తిస్తారు. గర్భిణులను పరీక్షించి వారికి అవసరమైన పోషకాహార ఆవశ్యకతను వివరిస్తారు. ఎంసీపీ కార్డులు అందిస్తారు. చిన్నారుల్లో సికిల్ సెల్ అనీమియాను గుర్తించి చికిత్స చేస్తారు. క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు, చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. మానసిక వైద్యసేవలు, ఆయుష్‌సేవలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, పోషణ్ అభియాన్, ఈట్ రైట్, తల్లీబిడ్డ సేవలు, రక్తదాన శిబిరాల నిర్వహణ, ఆయుష్మాన్ వయో వందన ఆరోగ్య కార్డుల పంపిణీ, పరిశుభ్రత, పోషకాహారానికి సంబంధించి సమాచారం, కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజనలో ప్రత్యేక నమోదు చేస్తారు. సికిల్ సెల్ కార్డు, ఐడీ రిజిస్ట్రేషన్ చేస్తారు. మహిళలకు వచ్చే నెల 2వరకు ఈ వైద్య పరక్షలు నిర్వహిస్తారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మొలగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మల్లేశ్వరి కోరారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు వేళాయె..!

- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్కాలర్‌షిప్
- ఈనెల 30వ తేదీ వరకు గడువు
- డిసెంబర్ 7న రాతపరీక్ష



ఆలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చదువులు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తూ చేయూతనిస్తోంది. ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. దరఖాస్తుకు ఈనెల 4వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గడువు విధించారు. పరీక్ష డిసెంబర్ 7వ తేదీన నిర్వహిస్తారు. ప్రభుత్వ బడుల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఇందులో అర్హత సాధిస్తే 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు యేటా రూ.12వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందుతుంది.

అర్హులు వీరే..: ప్రస్తుతం 2025-26 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఓసీ, బీసీలైతే 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు అయితే 50శాతం మార్కులు లేదా దానికి సమానమైన గ్రేడ్ సాధించిన వారు అర్హులు.

- విద్యార్థి కుటుంబ ఆర్థిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించరాదు. ప్రభుత్వ ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్‌గా చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ పాఠశాలలు, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంది.

విద్యార్థులు డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

పేద విద్యార్థులకు చక్కటి అవకాశం

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ పరీక్ష పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకు సాయంగా ఉంటుంది. విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షలో ప్రతిభ చూపితే నాలుగేళ్లపాటు ఆర్థిక వెసులుబాటు ఉంటుంది.

-శామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు

హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష



సమావేశం నిర్వహిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. కర్నూలులోని న్యాయ సేవాసదన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసులతో బాధితులు నష్టపోకుండా వారికి తగిన రీతిలో ఆర్థిక సాయం పొందేందుకు అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 76 హిట్ అండ్ రన్ కేసులకు 21 కేసుల్లో నష్టపరిహారాన్ని చెల్లించేందుకు సఫలీకృతమైనట్లు అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 37 హిట్ అండ్ కేసులలో 11 కేసులలో నష్టపరిహారం మంజూరైనట్లు అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మిగతా హిట్ అండ్ రన్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కారమై బాధితులకు నష్టపరిహారం త్వరగా అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల డీఆర్వోలు వెంకటనారాయణమ్మ, రాము నాయక్, నంద్యాల డీటీవో శివారెడ్డి, కర్నూలు రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ భరత్ చవాన్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



4 గేట్లతో కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం కుడి, ఎడమ రెండు విద్యుత్ కేంద్రాల్లో గడిచిన 24 గంటల్లో 32.477 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి జెన్‌కో అధికారులు గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో జలవనరులశాఖ ఇంజనీర్లు డ్యాం నాలుగు రేడియల్ క్రస్ట్ గేట్లను ఒక్కొక్కటి 10 అడుగుల ఎత్తు మేరకు తెరిచి దిగువ సాగర్‌కు 1,11,016 క్యూసెక్కులు దిగువ సాగర్‌కు విడుదల చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి డ్యాం నీటిమట్టం 884 అడుగులుగా ఉండగా.. నీటినిల్వ సామర్థ్యం 211 టీఎంసీలుగా నమోదగా అయింది. ఎగువ జూరాల స్పిల్‌వే, విద్యుదుత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి 2,07,338 క్యూసెక్కులు శ్రీశైలం రిజర్వాయర్‌కు వచ్చి చేరాయి. శ్రీశైలం రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 66,060 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఉపాధ్యాయుల విజయవాడ బాట

(5వ పేజీ తరువాయి)

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ నెల 19న విజయవాడలో మధ్యాహ్నం 2గంటలకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేయ నున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విదంగా ఒక వేడుకలా నిర్వహించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్నీ ఏర్పాట్లుచేస్తున్నారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ధ్రువపత్రాలు పరిశీలన చేసుకున్న రాయల సీమ విశ్వవిద్యాలయంలో గురువారం ఉదయం 8 గంటల్లోపు అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంది. ప్రభుత్వమే ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సులు 134 ఉమ్మడి జిల్లాలకు కేటాయిం చారు. ఈ బస్సుల ద్వారా అభ్యర్థులు విజయవాడకు చేరుకుంటారు.

అన్ని ఏర్పాట్లు చేశాం: ఇన్‌చార్జి కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్: రేపు విజయవాడకు బయలుదేరే డీఎస్సీ ఉపాధ్యాయుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ నవ్య తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. కర్నూలు జిల్లా తరుపున చేసిన ఏర్పాట్లపై ఇన్‌చార్జి కలెక్టర్ డా.బి.నవ్య రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. గురువారం ఉదయం ఉపాధ్యాయులు అల్పాహారం అనంతరం ఉదయం బయలు దేరుతారని, వారికి మార్గమధ్యలో భోజనం ఏర్పాటు చేశామన్నారు. రాత్రికి గుంటూ రులో బస ఉంటుందని తెలిపారు.

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో..

అభ్యర్థులందరిని కోఆర్డినేషన్ చేసేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈవోలను, ఉప విద్యాశాఖ అధికారులను లైజన్స్ ఆఫీసర్లుగానూ, నోడల్ ఆఫీసర్‌గా నియమిం చింది. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అభ్యర్థులకు బస్సులను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి అభ్యర్థులకు అల్పాహారం నుంచి మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనాలు స్నాక్స్‌ను స్వీకరించి తిరిగి కర్నూలు చేరే వరకు ఏర్పాటు చేసింది. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిసౌకర్యాలు ఏర్పాటుచేసినట్లు కర్నూలు డీఈవో అధికారి శామ్యూల్‌పాల్ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు నంబర్ 1 నుంచి 124 వరకు ఉమ్మడి జిల్లాల అభ్యర్థులకు, 125 నుంచి 133 నెంబరు వరకు గల బస్సులను నాన్ లోకల్ కేటగిరి అభ్యర్థులకు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

ఉల్లి.. గొర్రెలను వదిలి..!



ఉల్లి సాగు చేసే రైతులకు కన్నీటి కష్టాలు తప్పడం లేదు. ఇంకా ఆర్థిక భారాన్ని మోయలేక వర్కూరు గ్రామానికి చెందిన రంగముని అనే కౌలు రైతు రెండెకరాల్లో ఉల్లిని బుధవారం గొర్రెలకు వదిలేశాడు. అతడు రూ.15వేలు ప్రకారం దాదాపు ఐదెకరాలు పొలం కౌలుకు తీసుకున్నాడు. ఖరీఫ్‌లో రెండెకరాల చొప్పున ఉల్లి, పత్తి సాగుచేశాడు. మరో ఎకరా వరి పంట వేశాడు. ఉల్లి సాగులో విత్తనాలు, నారు పెంపకం, నాటు, కలుపులు, ఎరువులు, పిచికారీ కోసం సుమారు రూ.1.60లక్షలు ఖర్చు చేశాడు. ఇప్పుడు ఉల్లి పీకడం, కోత, గ్రేడింగ్, మార్కెట్ తరలించడానికి ఎకరాకు మరో రూ.40 వేలు ఖర్చు అవుతుంది. ఎకరా కోత చేయడానికే రూ. 13 వేలు చెల్లించాలి. ఈ తతంగమంతా పూర్తిచేసి మార్కెట్‌కు తరలిస్తే ఎకరాకు రూ.40వేలు కూడా వచ్చే పరిస్థితి లేదు. నష్టం తగ్గించుకోవడానికే ఉల్లి పంటను గొర్రెలకు మేతగా వదిలేశానంటూ రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ● కోడుమూరు రూరల్, ఆంధ్రజ్యోతి

సురక్షితంగా స్వదేశానికి..


సుజాతమ్మ


నివేదిత

డోన్ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, ఆమె కుమార్తె కోట్ల నివేదితమ్మతో కలిసి ఈ నెల 6న సరోవర్ యాత్రకు వెళ్లి నేపాల్‌లో జరుగుతున్న అలర్లలో చిక్కుకున్న విషయం తెలిసిందే. సరోవర్ యాత్రలో భాగంగా ఓ లాడ్జిలో లగేజీని భద్రపరచగా.. ఆందోళనకారులు ఆ లాడ్జిని నిప్పు పెట్టారు. దీంతో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సంబంధించిన రూ.5లక్షల నగదు, లగేజీ మొత్తం కాలిపోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కోట్ల అభిమానులు, కార్యకర్తలు ఆందోళన చెందిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు సరోవర్ యాత్రను ముగించుకుని బుధవారం ఢిల్లీకి సురక్షితంగా చేరుకున్నారు. అక్కడి నుంచి హైదరాబాదుకు బుధవారం రాత్రికి చేరుకుంటున్నట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, ఆమె కుమార్తె నివేదితమ్మ క్షేమంగా స్వదేశానికి చేరుకోవడంతో కోట్ల అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అవుకు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాలపై ఎస్‌ఐ రాజారెడ్డితో కలసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉగ్రసేనారెడ్డి మాట్లాడుతూ మారక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదివితే జీవిత లక్ష్యాలను చేరుకుంటారని అన్నారు. సమావేశంలో ఎంఈవో వెంకటేశ్వరరెడ్డి, హెచ్‌ఎం దస్తగిరమ్మ, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రైన్ పనుల పరిశీలన


మ్యాజిక్ డ్రైన్ పనులను పరిశీలిస్తున్న ఏపీడీ సాంబశివరావు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మ్యాజిక్ డ్రైన్ పనులను ఏపీడీ సాంబశివరావు బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 400 మీటర్ల మేర మ్యాజిక్ డ్రైన్‌ను నిర్మిస్తున్నామన్నారు. దీనికి రూ. 2.50 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. అడుగున్నర వెడల్పు రెండు అడుగుల లోతు గుంత తవ్వి అందులో కంకర నింపి నీటిని భూగర్భంలోకి ఇంకిపోయేలా చేయటమే మ్యాజిక్ డ్రైన్ ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. దీని ద్వారా నిధుల ఖర్చు తగ్గించటం, భూ గర్భజలాలను పెంచవచ్చని ఆయన తెలిపారు.

నిండుకుండల్లా చెరువులు

- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో చెరువులు నిండుకుండల్లా మారాయి. గత మూడు సంవత్సరాల నుంచి నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువులు వెలవెలబోయాయి. దీంతో రైతులతో పాటు, వివిధ వర్గాల ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కొన్నారు. ఇటీవల విస్తారంగా కురిసిన


నిండుకుండలా ఉన్న సద్దల వెంగన్న చెరువు


నీటితో కళకళలాడుతున్న తిమ్మనాయినిపేట చెరువు

వర్షాలతో చెరువులు నిండు కుండల్లా కళకళలాడుతున్నాయి. మండలంలో ప్రధానమైన తిమ్మనాయినిపేట చెరువుకు పెద్ద ఎత్తున నీరు చేరడంతో పూర్తి స్థాయిలో నిండటానికి అడుగు మాత్రమే మిగిలివుంది. ఇక సద్దలవెంగన్న చెరువు, దయ్యాల చెరువు, హనుమంతుగుండం చెరువులు సైతం పూర్తి స్థాయి నీటి మట్టంతో కళకళలాడుతున్నాయి. దీంతో రైతులతో పాటు, వివిధవర్గాల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి : పీడీ

అవుకు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులకు ఆదేశించారు. బుధవారం అవుకు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం అన్నవరం, అవుకు గ్రామాల్లో సాగవుతున్న పండ్ల తోటలు, పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్లు, పశువుల ఎరువును వేసెందుకు ఏర్పాటు చేసిన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయని వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. లేబర్ బడ్జెట్ 100 శాతం చేరుకోవాలన్నారు. మండలంలో పండ్లతోటల పెంపకం 55 ఎకరాల్లో సాగవుతుండగా, మూగ జీవాల దాహార్తి కోసం 30 నీటి తొట్లు ఏర్పాటు చేశామన్నారు. పశువుల నుంచి వచ్చే ఎరువును భూమిపై వేయకుండా భూమి లోపల వేసే విధంగా 30 గుంతలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ఏపీవో ప్రకాశ్‌రావు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలానికి రెండువేల కమ్యూనిటీ పిట్లు


తోటలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

మంజూరు చేసినట్లు పీడీ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం బనగానపల్లె ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు నీరు బయటకు వెళ్లకుండా కమ్యూనిటీ పిట్లు నిర్మించుకోవాలన్నారు. అలాగే ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సేవా పక్వాడ్

డోన్ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సమైఖ్యాంధ్ర కట్ట వద్ద సేవా పక్వాడ్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా బీజేపీ జిల్లా వైస్ ప్రెసిడెంటు ఎస్‌వీ రమణ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గాజుల ఉష లక్ష్మి, బొగ్గరపు నటరాజ్, బద్రి సుధాకర్, సుబ్రహ్మణ్యం,ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రవిశంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

- అలాగే పాతబస్టాండులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు హాజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి, సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ రాకేష్, బీజేపీ , ఓబీసీ నాయకులు పాల్గొన్నారు.


బనగానపల్లెలో మోదీ చిత్రపటానికి అభిషేకం చేస్తున్న నాయకులు

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు

బనగానపల్లె: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని నేలమఠం, విశ్వకర్మ కేంద్రంలో పట్టణ రూరల్ అధ్యక్షుడు శరత్‌చంద్రకుమార్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి హరికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తులు

డోన్ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో నాలుగో విడత ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తును ప్రింట్ తీసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటలలోపు ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో మెరిట్ జాబితాలో పేర్లు పొందుపరచడం జరగదన్నారు. ఈ నెల 29న ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఐటీఐలలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల దరఖాస్తు చేసుకోవాలి

రుద్రవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఆటో, క్యాబ్ డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. వాహనంపై ఎటువంటి పెండింగ్ చలానాలు ఉండరాదన్నారు. 2023లో లబ్ధి పొందిన వారికి కొత్త దరఖాస్తులు అవసరం లేదన్నారు. ఈకేవైసీ వెరిఫికేషన్ పూర్తి చేయించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన వారికి రాష్ట్రప్రభుత్వం రూ.15వేలు ఆర్థిక సాయం మంజూరు చేస్తుందన్నారు.

పాల్ ల్యాబ్ పద్ధతిలో విద్యా బోధన

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నూతన పద్ధతిలో విద్యా బోధన చేస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం విద్యార్థులకు ట్యాబులు, హెడ్‌ఫోన్స్ ద్వారా పాల్ ల్యాబ్ విద్యా బోధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వయంగా వారికి వారే పాఠ్యాంశాలను నేర్చుకునే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికి ఒక ట్యాబ్, హెడ్ సెట్ ఇచ్చి ద్వారా సాంకేతిక విజ్ఞానాన్ని అందిస్తున్నామన్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలని వాసవీ బొమ్మిడాల డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపాల్ యు.వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన, టెస్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. రెడ్‌రిబ్బన్ క్లబ్ సమన్వయ కర్త డాక్టర్ రామసుబ్బారెడ్డి, సీఈఆర్‌డీఎస్ ప్రాజెక్టు మేనేజరు వర్ధనాచారి, చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

శిరివెళ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో డ్రైనేజీల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఈవో అశ్విన్ కుమార్ తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో స్థానికులు ఈవో దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఈవో పరిశీలించి పారిశుధ్య పనులు చేయించారు. శాశ్వత డ్రైనేజీని నిర్మిస్తామన్నారు. నాయకుడు బీసీ పిడా హుసేన్ ఉన్నారు.

స్వచ్ఛరథం మంజూరు

బనగానపల్లె, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి స్వచ్ఛరథం మంజూరైనట్లు ఈవోఆర్‌డీ బాలాంజనేయులు తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛ రథాన్ని ఈవో సతీశ్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు.

చెత్త సేకరణను పకడ్బందీగా చేపట్టాలి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణను పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌డీవో శివారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు గ్రామాల్లో చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామ కార్యదర్శి జయరామిరెడ్డి, ఎంసీవో రమణారెడ్డి ఉన్నారు.

తడిచిన మొక్కజొన్న ధాన్యం

రుద్రవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలంలో బుధవారం ఉదయం వర్షం కురిసింది. మండలంలోని హరినగరం, నరసాపురం, ముత్తలూరు,ఆలమూరు, కోటకొండ గ్రామాల్లో రోడ్ల వెంట ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం తడిచిపోయింది. దాంతో తడిచి ధాన్యాన్ని కుప్పలుగా బోసి మళ్లీ ఆరపెట్టారు. చేతికొచ్చిన పంట తడిచిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలని ఈవోపీఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మూడో శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఎస్‌డబ్ల్యూపీసీ వరకు రోడ్డు కిరువైపులా మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టామన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద్ర సంఘాల కార్మికులు పాల్గొనాలని కోరారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

ప్యాపిలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ప్యాపిలిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. పట్టణానికి చెందిన భాస్కర్ పాత బస్టాండు సమీపంలో బట్టల దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నా డు. అయితే ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడేవాడు. కర్నూలు, వివిధ ప్రాంతాల్లో వైద్యం చేయించిన వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన భాస్కర్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మదుసూధన్ తెలిపారు.

నేడు మెగా క్యాంప్

డోన్ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం మెగా క్యాంప్‌ను నిర్వ హిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ తెలిపారు. క్యాంపును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే


తర్తూరులో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. తర్తూరు, మండ్లెం, జూపాడుబంగ్లా, తాటిపాడు, పోతులపాడు, తరిగోపుల గ్రామాల్లో బుధవారం బాధితుల ఇంటిదగ్గరికి వెళ్లి చెక్కులను అందజేశారు. అనారోగ్యాలబారినపడి నిరుపేదలు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు. తరిగోపులలో రత్నమ్మ, తర్తూరులో అరుణకుమారి, మండ్లెంలో నాగేంద్ర, పోతులపాడు సుంకమ్మ, తాటిపాడులో సిద్దిక్, ఉసేనయ్యగౌడు, జూపాడు బంగ్లాలో రమణకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గిరీశ్వరరెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, కేసీ కాలువ చైర్మన్ పరమేశ్వరరెడ్డి, రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జంగాలపెద్దన్న, నారాయణ రెడ్డి, దొరబాబురెడ్డి, రవికాంత్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మన్నగౌడు, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఎంవీఐ దాతృత్వం

● 60 మందికి డ్రైవింగ్ లైసెన్స్ కోసం రూ.80 వేలు సాయం


గిరిజన డ్రైవర్లతో ఆత్మకూరు ఎంవీఐ ఏఎస్ఎన్ రెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సత్యనారాయణ రెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని పెచ్చెర్వు, కొట్టాలచెరువు చెంచుగూడేలకు చెందిన గిరిజన డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేయడం కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వాస్తవానికి ఆయా గూడేలకు చెందిన సుమారు 60 మంది గిరిజన ఆటో, ఇతర వాహనాల డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్‌లు లేవు. సుమారు రూ.80వేలకు పైగా డ్రైవింగ్ లైసెన్స్ చలానా ఖర్చులను ఎంవీఐ భరాయించి గిరిజన డ్రైవర్లందరికి లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేయించారు. అంతేకాదు.. వారందరిని బుధవారం కరివేన సమీపంలోని ఎంవీఐ కార్యాలయానికి పిలిపించి ఎల్ఎల్ఆర్ పత్రాలను వారికి అందజేశారు. నెలలోగా అందరికీ డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇస్తామని భరోసా ఇచ్చారు. అలాగే అక్కడికి వచ్చిన గిరిజన ఆటో డ్రైవర్లందరికి మర్యాదపూర్వకంగా మధ్యాహ్న భోజనాన్ని సమకూర్చారు.

అన్నదానానికి విరాళం


చెక్కు అందజేస్తున్న డాక్టర్ సాయి శ్రీకాంత్

ఆత్మకూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఆత్మకూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ తాళ్లపల్లి రంగశాయి, శ్యామలసాయి దంపతులు రూ.1,11,116 విరాళం అందజేశారు. విరాళం చెక్కును వారి కుమారుడు సాయిశ్రీకాంత్ బుధవారం అన్నదాన కమిటీ అధ్యక్షులు రామయ్య, కోశాధికారి జక్కా మురళీకి అందజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. వెంకటేశ్వర స్వామి ఆలయ అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకొచ్చి సహకారాన్ని అందించడం సంతోషకరమని అన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి: జీసీడీవో


మోడల్ స్కూల్‌లో రికార్డును పరిశీలిస్తున్న జీసీడీవో

మిడుతూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని జీసీడీవో నాగ సువర్చల దేవి అన్నారు. మిడుతూరు మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని, కేజీబీవీని బుధవారం తనిఖీ చేశారు. జీసీడీవో మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు సీజనల్ వ్యాధులు సోకకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్‌లకు సూచించారు. ప్రిన్సిపాళ్లు శ్రీదేవి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది


సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

పగిడ్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని ఎంఈవో సుభాన్ అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు, మండల ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఉపాధ్యాయులను పగిడ్యాల వెలుగు కార్యాలయంలో బుధవారం సన్మానించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కేజీబీవీ ప్రిన్సిపాల్ ఉష, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ముర్తుజావలిలతో పాటు మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారికి పూలమాలలు, దుశాలువాలతో సన్మానించారు. ఎంఈవో-2 మురళీమోహన్‌రెడ్డి, జడ్పీ పాఠశాల హెచ్ఎం మధుసూదన్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌన్సిల్ మీట్‌లో అవుట్ సోర్సింగ్ పోస్టు రచ్చ

సమాచారం ఇవ్వకుండా తీర్మానం చేయడంపై రభస


కమిషనర్‌ను నిలదీస్తున్న కో ఆప్షన్ సభ్యులు

ఆత్మకూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో బుధవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో రభస జరిగింది. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సభలో మున్సిపల్ అధికారులు రెండు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఇందులో ఆబిద్‌అలీ అనే మున్సిపాలిటీ అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఈ ఏడాది ఏప్రిల్ 11వ తేదిన అనారోగ్యంతో మరణించడంతో ఆయన స్థానంలో అతని కుమారుడు షావుల్ హమీద్‌ను నియమించాలన్న తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. అదేవిధంగా రెండో తీర్మానంగా కలబండి రామన్న అనే అవుట్ సోర్సింగ్ సిబ్బంది తనకు అనారోగ్య సమస్యలు ఉండటంతో కొన్ని రోజులుగా విధులకు హాజరు కావడం లేదు. దీంతో ఆయన స్థానంలో యెనుమల చిన్నఓబయ్య అనే వ్యక్తిని నియమించేందుకు తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే అసలు కలబండి రామన్నను సమాచారం ఇవ్వకుండా తొలగించాల్సిన అవసరం ఏముందని, అలాగే తమకు తెలియకుండానే కొత్త వ్యక్తిని అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా ఎలా నియమించే ప్రయత్నం చేస్తారని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, ఆమె తండ్రి, కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్ కమిషనర్ రమేశ్‌బాబును నిలదీశారు. అయితే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చెప్పడం వల్లే తాను ఓబయ్యను నియమించేందుకు తీర్మానం తయారు చేసినట్లు కమిషనర్ సమాధానం ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యేకు ఫోన్ చేసి క్లారిటీ ఇవ్వాలని కో ఆప్షన్ సభ్యులు నిలదీయడంతో కమిషనర్ మిన్నకుండిపోయారు. తమకు తెలియకుండా తీర్మానాలు ఎలా చేస్తారని, ఇష్టారాజ్యంగా తీర్మానాలు తయారు చేసుకునేటప్పుడు తామేందుకని ఘాటుగా స్పందించారు. చివరికి ఆ తీర్మానాన్ని రద్దు చేస్తున్నట్లు సభ్యులు ప్రకటించారు. అనంతరం ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, రోడ్లపై ఆవుల సంచారం వల్ల ప్రజలకు ఇబ్బందులు నెలకొన్నట్లు కౌన్సిల్ దృష్టికి సభ్యులు తెచ్చారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని కమిషనర్ రమేష్‌బాబు హామీ ఇచ్చారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


నంద్యాలలో రక్తదాతను అభినందిస్తున్న నాయకులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ కార్యాలయంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాలాజీ కాంప్లెక్స్ కళ్యాణమండపంలో మానవతా సేవలో భాగంగా రక్తదానం, ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. నాయకులు మురళీధర్, చంద్ర శేఖర్, కృష్ణమూర్తి, ఆదినారాయణ, సుధాకర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, చంద్ర, బాలముని, నాగేశ్వరరెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యాలయంలో నాయకులు భవనాసి వాసు, నాగమహేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

ఆత్మకూరు: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకులు వెంకటసుబ్బయ్య ఆచారీ చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. అలాగే మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ శిబిరంలో ముందుగా మోమిన్ షబాన రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీహెచ్‌సీ సూపరిండెంట్ డాక్టర్ రాయుడు, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సాజిదాఫిర్దోస్, టీడీపీ ఆత్మకూరు మండలాధ్యక్షులు రవీంద్రబాబు, బీజేపీ నాయకులు రవీంద్రారెడ్డి, పద్మావతి, నూర్, చింతా నాగేశ్వరరావు, కిరణ్, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, అరుణ్ ఉన్నారు.

పాణ్యం: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, శాంతిరాం ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. కోఆర్డినేటర్ నాగరాజు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత్ చవాన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జానకి, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి సురేశ్, వైద్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

● బీజేపి మండల కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదినం ఘనంగా నిర్వహించారు. పాణ్యంలోని జ్వాలా లిటిల్ ఏంజల్స్ పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, రామభద్ర, పవన్ విద్యార్థులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మానపాటి శ్రీనివాస గౌడ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, బీజేపీ నాయకులు అల్వాల బాలయ్య, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

బండిఆత్మకూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్, గైనకాలజిస్టు దేవసాగర్, డాక్టర్ భావన, సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. బుధవారం బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 8వ జాతీయ పోషణా మాసోత్సవం నిర్వహించారు. డాక్టర్ సవిత, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు ఆనందమ్మ, రమణమ్మ, రామేశ్వరమ్మ, సునీత, సుంకమ్మ పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి


సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో కాలనీలోని నేషనల్ పీజీ కళాశాలలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అధ్యక్షతన బుధవారం సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై శిక్షణ


మహిళలకు అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

పాణ్యం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల మహిళా సమాఖ్యలో బుధవారం గ్రామ సంఘం ప్రతినిధులకు విజన్ బిల్డింగ్‌పై ఈనెల 19 వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏరియా కోఆర్డినేటర్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల పొదుపు సంఘాల ప్రతినిధులకు శిక్షకులు అవగాహన కల్పించారు. ఏపీఎంలు పుల్లయ్య, కాశీశ్వరుడు, శ్రీనివాసులు, శిక్షకులు కృష్ణమూర్తి, అంబమ్మ, సీసీలు, పాల్గొన్నారు.

'నందికొట్కూరు నియోజకవర్గాన్ని కర్నూలులో కలపాలి'

నందికొట్కూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లాలో కలపాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు ప్రజల అభిప్రాయాలను పక్కన పెట్టి, కేవలం 27 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలు జిల్లాలో కాకుండా 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద్యాల జిల్లాలో కలపడం వల్ల రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గాబ్రియల్, మేకల శేఖర్, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలోకి వర్షపు నీరు

● విద్యార్థుల అవస్థలు


క్రిష్ణరావుపేట గ్రామంలో పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు

పాములపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని క్రిష్ణారావుపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోకి వర్షపునీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ప్రక్క వీదిలోని సిసి రోడ్డు పై నీరు నిలవడం, ఎక్కడికి వెల్లే పరిస్థితి లేక పోవడంతో నీరు పాఠశాలలోకి చేరుతోంది. అలాగే పాఠశాల ముందు బాగంలో హైవే రోడ్డు నిర్మాణం పనుల్లో బాగంగా డ్రైనేజి పూడ్చి వేయడంతో పాఠశాలలో నిలిచిన వర్షపునీరు బయటిక వెల్లే అవకాశం లేదు.అంతేకాక నిల్వ ఉన్న నీలిలో విషపురుగులు సంచరిస్తుంటాయని విద్యార్థుల తల్లి తండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


నంద్యాల కలెక్టరేట్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు


నంద్యాలలోని జిల్లా పోలీసు కార్యాలయంలో..

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ జయంతి ఉత్సవాలను బీసీ సంక్షేమశాఖ అధికారి జగ్గయ్య జ్యోతి వెలగించి ప్రారంభించారు. జగ్గయ్య మాట్లాడుతూ కత్తి, సుత్తి, కొడవలి లాంటి చేతి వృత్తుల పరికరాలను విశ్వకర్మ తయారు చేసి, ఎన్నో దేవతా విగ్రహాలకు రూపాన్ని విశ్వకర్మ ప్రపంచానికి ఇచ్చారని గుర్తుచేశారు. కలెక్టరేట్ ఏవో సుభాకర్, డీన్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబులేసు, బీసీ సంక్షేమశాఖ సిబ్బంది, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు. నంద్యాల ఆచార్యా ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఇన్‌చార్జి ఏడీఆర్ నీలిమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శాస్త్రవేత్తలు, బోధనా సిబ్బంది, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

నంద్యాల టౌన్: నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని కాళికాంబ దేవాలయంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి పురోహితులు బాణాల లక్ష్మీనారాయణాచార్యులు, బాణాల రామమోహనాచార్యులు సమక్షంలో విశేష పూజలు నిర్వహించారు. అలాగే విశ్వకర్మ యజ్ఞాన్ని సంప్రదాయబద్ధంగా చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

నంద్యాల టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలంలోని సుగాలి మెట్ట వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపిన వివరాలివీ.. నంద్యాల పట్టణం పెద్ద బండ ప్రాంతానికి చెందిన మహేంద్ర కుమారుడు మహావీర్ పెద్ద కొట్టాల నుంచి నంద్యాలకు వస్తుండగా సుగాలి మెట్ట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మహావీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి సూర్యప్రకాశ్ పరిస్థితి విషమంగా ఉంది. చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

పశువులకు టీకా తప్పనిసరి

పగిడ్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పాడి పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు శ్రీనివాసరావు సూచించారు. ముచ్చుమర్రి, నెహ్రూనగర్ గ్రామీణ పశు వైద్యశాలలో పశువులకు బుధవారం గాలికుంటు టీకాలు వేయించారు. పశువైద్యాధికారి రాగసంధ్య, వీఎల్‌వో శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పాములపాడు: పశువులకు గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి భాస్కర్ సూచించారు. కంబాలపల్లి గ్రామంలో బుధవారం పశువుల రైతులకు టీకాలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని 15 ఎద్దులు, ఆవులు, 225 గేదెలు, దూడలకు టీకాలు వేశారు. సిబ్బంది స్వాతి, విజయమ్మ, కవిత, నాగేశ్వరరావు, మున్వర్‌బాషా పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల నుంజి జీతాలు ఇవ్వడంలేదని, వెంటనే చెల్లించేలా చూడాలని జీజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు కోరారు. ఎంపీ బైరెడ్డి శబరికి వినతిపత్రం బుధవారం వినతిపత్రం అందించారు. అలాగే మిగతా సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు.

వాహన పత్రాల పరిశీలన

నంద్యాల టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫరూక్ నగర్‌లో వాహన మిత్రకు సంబంధించిన పత్రాలను మున్సిపల్ కమిషనర్ బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఆటో వాహన దారులందరు వాహన మిత్ర పత్రాలు చూసుకుని స్థానిక సచివాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్టుగా ఈ దసరాకు వారికి నగదు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. ఆటోకు ఆర్సీ, ఎఫ్‌సీ, ట్యాక్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు సరిగా చూసుకుని అప్లై చేసుకోవాలని తెలిపారు. పట్టణంలో సుమారుగా 10వేల ఆటోలు ఉన్నట్లు అంచనా వేశామన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలలో రక్తహీనతను నివారించడానికి, క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగా గుర్తించడానికి తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలని వైద్యాధికారి పవన్‌కుమార్, డాక్టర్ ప్రసన్నలక్ష్మి సూచించారు. బుధవారం స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్‌లో భాగంగా బైర్లూటి గిరిజన గూడెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రముఖ వైద్యుల చే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, ప్రత్యేక చికిత్సలు నిర్వహించారు. వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు మండలంలోని పలు గ్రామాలలో పీఎం స్వస్థ్ నారి కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వైద్యులచే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం డాక్టర్ శోకత్, డాక్టర్ హర్షలు మాట్లాడుతూ.. గిరిజన బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. సర్పంచ్ గురువమ్మ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి గిరిజనుల ఆరోగ్యం కోసం నిర్వహించే ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీహెచ్‌వో బాషా, సూపర్ వైజర్లు భ్రరాంభ,రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ అహ్మద్ బాషా, దీపిక, స్టాఫ్ నర్స్ తులసి, ఏఎన్ఎం బేబిజ్యోతి, సోమేశ్వరి పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి'

నంద్యాల టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపాలిటి పరిధిలోని అన ధికార లేఅవుట్లు క్రమబద్ధీకరణ చేసుకోవాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ప్రజలకు బిల్డర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వచ్చే నెల 23 వ తేదిలోగా ఎల్ఆర్ఎస్ ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 'కుడా' ప్లానింగ్ అధికారి మోహన్‌కుమార్, సిటీ ప్లానర్ వీఎస్ఎన్‌మూర్తి, టీపీఎస్ రిజ్వానా, అధికారులు తదితరులు పాల్గన్నారు.


'పరిశుభ్రత పాటించాలి'


నంద్యాలలో జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

నంద్యాల టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పురపాలక సిబ్బంది పట్టణంలోని శుభ్రతతో పాటు వారి ఆరోగ్యం కాపాడుకోవాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. బుధరవారం స్థానిక పురపాలక కార్యాలయం వద్ద స్వచ్ఛతహి సేవా కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వచ్చేనెల 2వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురపాలక కార్యాలయం నుంచి పద్మావతి నగర్ మీదుగా గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ దాస్, ఎంఈ గురుప్ప, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఎవరైతే తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటారో వారి ఆరోగ్యం బాగుంటుందని మున్సిపల్ కమీషనర్ బేబి అన్నారు. బుధవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమీషనర్ బేబి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పటేల్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


నందికొట్కూరులో..


జన్మదిన శుభాకాంక్షలు
మా పెద్దాయన, కేంద్ర రైల్వే మాజీ సహాయ
మంత్రివర్యులు, డోన్ శాసనసభ్యులు
గౌ॥శ్రీ.కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి గారికి
ఇవే మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు..
మీ..
టి.ఇ.కేశన్న గౌడ్
మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్, డోన్.
శ్రీమతి కోట్ల సుజాతమ్మ గారు
మాజీ ఎమ్మెల్యే, డోన్.
శ్రీ కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి గారు
కేంద్ర రైల్వేశాఖ మాజీ సహాయ మంత్రివర్యులు, శాసనసభ్యులు, డోన్ నియోజకవర్గం
టి.ఇ.రాఘవేంద్ర గౌడ్, అడ్వకేట్,
తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, డోన్.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె



కోట్ల జన్మదిన వేడుకలను జయప్రదం చేయండి: టీఈ


టీఈ రాఘవేంద్ర గౌడ్

డోన్ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని టీడీపీ నాయకుడు టీఈ రాఘవేంద్ర గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 7 గంటలకు అన్న క్యాంటీన్ వద్ద ఉచిత అల్పాహార కార్యక్రమం ఉంటుందన్నారు. 10 గంటలకు పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద కేక్ కటింగ్ ఉంటుందని అన్నారు. ముఖ్య అతిథిగా టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రిలో మెగా హెల్త్ క్యాంపు, రక్తదాన శిబిరం, మధ్యాహ్నం 12.30 గంటలకు పాతబస్టాండులో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 1గంటకు లెప్రసీ, బ్లైండ్ కాలనీ వద్ద, అన్నక్యాంటీన్ వద్ద అన్న దాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి 7 గంటలకు అన్నక్యాంటీన్ వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కోట్ల అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.







GENERAL NOTICE

అందరికీ తెలియపరచడం ఏమనగా మా కక్షిదారులు Shriram Finance Ltd. Banaganapalli Branch వారు ఈ క్రింద ఉదహరించిన షెడ్యూలు Property ని Mortgage చేసుకొని **Boya Sheshaiah S/o B. Pamuleti** అను వారికి లోన్ ఇవ్వదలచినారు. కావున ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న యెడల 7 రోజులలో తెలుపవలెను.

SCHEDULE OF THE PROPERTY

The part and parcel land in plot no28 situated in Nandyala Registration district, Banaganipalli sub registration district in survery bearing no. 221-3B-2 of Yaganti palli village and Panchyath, Banaganipalli mandal Nandyal District.

Measurements : East-West: 56 feet, North-South : 35 feet.

Total site measurements: 217.77 sq yards.

Boundaries : East : 33 feet Road, **West :** Plot No.25, **North :** Plot No.29, **South:** Plot No.27

G.Madhusudhan Rao,
Advocate, Dhone, Kurnool.







